# శ్రీకృష్ణదేవరాయలు గొప్ప రాజనీతిజ్ఞుడు

- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి
- పలమనేరులో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ



పలమనేరు: శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఎమ్మెల్యేలు

**పలమనేరు:** విజయనగరాన్ని పాలించిన శ్రీకృష్ణదేవరాయలు గొప్ప రాజనీతిజ్ఞుడని రాష్ట్ర విద్యుత్, అటవీ–పర్యావరణ, గనుల శాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. పలమనేరు పట్టణంలోని మున్సిపల్ కాంప్లెక్స్ వద్ద స్థానిక బలిజసేవా అభ్యుదయ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ కార్యక్రమంలో గురువారం ఆయన పాల్గొని విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తెలుగు భాష, సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి పరిచయం చేసిన మహానుభావుడు శ్రీకృష్ణదేవరాయలు అని గుర్తుచేశారు. ఆయన తెలుగుభాషాభివృద్ధికి చేసిన సేవలు ఘనమైనవని తెలిపారు. ముఖ్యంగా అష్టదిగ్గజాలతో కవులను పోషించిన మహనీయుడన్నారు. నేటి రాజకీయ నాయకులకు ఆయన ఆదర్శనీయుడని తెలిపారు. ఇలాంటి మహనీయుని విగ్రహాన్ని పలమనేరులో ఆవిష్కరించడం చాలా ఆనందంగా ఉందని చెప్పారు. విగ్రహ ఏర్పాటుకు కృషిచేసిన స్థానిక బలిజలకు ఆయన అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటు సభ్యులు రెడ్డెప్ప, స్థానిక ఎమ్మెల్యే వెంకటేగౌడ, డీసీసీబీ చైర్‌పర్సన్ రెడ్డెమ్మ, చిత్తూరు ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు, మున్సిపల్ చైర్‌పర్సన్ పవిత్ర మురళీకృష్ణ, ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్‌రెడ్డి, టీటీడీ బోర్డు సభ్యులు పోకల అశోక్‌కుమార్, బాస్ అధ్యక్ష, కార్యదర్శులు బాబు, కిరణ్‌కుమార్, మాజీ డీసీసీ అధ్యక్షులు సుధాకర్, విగ్రహ దాత, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఆకుల గజేంద్రప్రసాద్ పట్టణానికి చెందిన బలిజ కులస్తులు పాల్గొన్నారు.

**శ్రీకృష్ణదేవరాయుల జయంతి వేడుకలు**

**పుంగనూరు:** శ్రీకృష్ణదేవరాయుల జయంతి వేడుకలను గురువారం పట్టణంలో ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణదేవరాయుల బలిజసంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయుల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో బలిజ సంఘ నాయకులు కొండవీటి నాగభూషణం, నానబాలగణేష్, పూలత్యాగరాజు, మధురాయల్, డాక్టర్ ప్రభాకర్, సుబ్బరాయప్ప, రత్న, మణి, కుమార్, నరేష్, బాలు, శివ, సురేష్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పుంగనూరు: రాయలు జయంతి వేడుకల్లో బలిజ సంఘం నాయకులు

**నాయకుల పనితీరు బాగాలేదు**

నియోజకవర్గంలోని అన్ని మండలాలకన్నా పుంగనూరు మున్సిపాలిటీలోనే 70 శాతం పదవులు పొందినా, పార్టీ కార్యక్రమాల పట్ల అశ్రద్ధ వహించడంపై మంత్రి డాక్టర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చురకలంటించారు. మున్సిపాలిటీలో గురువారం నిర్వహించిన గృహసారథుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ నియోజకవర్గంలో గృహసారథుల సమావేశం సజావుగా నిర్వహించకపోవడంతో తానే స్వయంగా రావాల్సి వచ్చిందని చెప్పారు. మున్సిపాలిటీలో నాయకులు ఎక్కువైపోయి ఎవరికి వారు నిర్లక్ష్యంగా వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. దీంతో నాయకులకు ముచ్చెమటలు పట్టాయి.

**అభివృద్ధి పనులు వేగవంతం చేయండి**

**చౌడేపల్లి :** మండలంలో జరుగుతున్న వివిధ అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి జెడ్పీటీసీ సభ్యుడు దామోదరరాజుకు సూచించారు. గురువారం పుంగనూరుకు వెళ్తుండగా ఎంపీడీఓ కార్యాలయం వద్ద మంత్రి పెద్దిరెడ్డిని జెడ్పీటీసీ కలిశారు. అభివృద్ధి పనులను సకాలంలో పూర్తిచేయడానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ షంషీర్, నేతలు హనుమంతురెడ్డి, రఘుస్వామి, వెంకట్రమణారెడ్డి తదితరులున్నారు.

## క్లుప్తంగా

### శ్రీవారి పాదక్షేత్రంలో శివరాత్రి వేడుకలు

**సదుం:** మండలంలోని కొత్తపల్లె శ్రీవారి పాదక్షేత్రంలో 18న శివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించనున్నారు. ఉదయం ప్రత్యేక అభిషేకం, అలంకరణ, సాయంత్రం భజన కార్యక్రమాలు, రాత్రి కోలాటం, జాగరణ మహోత్సవం ఉంటుందని నిర్వాహకులు తెలిపారు. ఉదయం నుంచి రాత్రి వరకు అన్నప్రసాద వితరణ చేస్తామని తెలిపారు.

### గో సంరక్షణ ట్రస్ట్‌కు విరాళం



రూ.లక్ష విరాళం ఆలయ అధికారులకు ఇస్తున్న దాత కుటుంబ సభ్యులు

**కాణిపాకం(యాదమరి):** కాణిపాక శ్రీ వరసిద్ధి వినాయక స్వామి గో సంరక్షణ ట్రస్ట్‌కు పలమనేరుకు చెందిన దాత గోవిందు గురువారం రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఇన్‌స్పెక్టర్ బాబుకు అందజేశారు. దాత కుటుంబ సభ్యులకు స్వామివారి ప్రత్యేక దర్శనం కల్పించారు. ఆశీర్వాద మండపంలో వేదపండితులు ఆశీర్వచనం పలికి స్వామివారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

### రూ.30 లక్షలతో సహకార పెట్రోల్ బంక్



పెట్రోల్‌బంక్ పనులను పరిశీలిస్తున్న సింగిల్ విండో చైర్మన్ హరినాథ్‌రెడ్డి

**రొంపిచెర్ల:** తిరుపతి–మదనపల్లె రహదారిలోని పెద్దగొట్టిగల్లు వద్ద రూ.30 లక్షలతో సహకార సంఘం ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనుననట్లు సింగిల్ విండో చైర్మన్ దేవులపల్లె హరినాథరెడ్డి తెలిపారు. పెట్రోల్ బంక్ పనులను గురువారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రొంపిచెర్ల సహకారం సంఘం జిల్లాలోనే ఆదాయార్జనలో మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో పెద్దగొట్టిగల్లు వద్ద ఉన్న ప్రభుత్వ స్థలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు ఉచితంగా స్థలాన్ని కేటాయించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నెల్లూరు రీజనల్ ఆఫీసర్ రాంప్రసాద్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### కాశీ వెళ్లిన మహిళ మృతి

**పలమనేరు:** పట్టణానికి చెందిన మహిళ కాశీ యాత్రకెళ్లి అక్కడ గుండెపోటుతో మృతి చెందిన సంఘటన గురువారం వెలుగుచూసింది. స్థానిక అంకిశెట్టివీధికి చెందిన పద్మనాభం భార్య సుగుణ(50) ఇటీవల స్థానికులతో కలసి కాశీ యాత్రకు వెళ్లింది. నాలుగురోజుల క్రితం ఆమెకు గుండెపోటు రావడంతో మృతి చెందింది. దీంతో ఆమె బంధువులు, యాత్రకు వెళ్లినవారు కలసి కాశీలోనే అంత్యక్రియలను పూర్తిచేసినట్లు తెలిపారు.

### వధూవరులకు ఎమ్మెల్సీ ఆశీర్వాదం



వధూవరులతో ఎమ్మెల్సీ, నాయకులు

**శాంతిపురం:** పీఏసీఎస్ డైరెక్టర్ సైఫుల్లా కుమారుడి వివాహానికి హాజరైన ఎమ్మెల్సీ భరత్ వధూవరులను ఆశీర్వదించారు. కర్ణాటకలోని కేజీఎఫ్‌లో గురువారం జరిగిన నిఖాకు హాజరైన భరత్, వధూవరులు అర్బాస్, సబీనాను అభినందించారు. ఆయన వెంట పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు ఉన్నారు.

### ఉత్తమ విద్యార్థులకు ప్రశంసాపత్రాలు

**పలమనేరు:** మండలంలోని కొలమాసనపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉత్తమ ప్రతిభ చూపుతున్న విద్యార్థులకు స్థానిక ఎల్ఐసీ శాఖ ఆధ్వర్యంలో గురువారం ప్రశంసా పత్రాలను పంపిణీ చేశారు. పాఠశాల హెచ్ఎం విజయకుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యత



వార్డులో పర్యటిస్తున్న మున్సిపల్ చైర్మన్ సుధీర్

**కుప్పం:** మున్సిపల్ పరిధిలోని ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రాధాన్యతనిస్తూ వార్డుబాట ప్రారంభించినట్లు మున్సిపల్ చైర్మన్ సుధీర్ తెలిపారు. ఆయన గురువారం వార్డు బాటలో భాగంగా 17వ వార్డులో పర్యటించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ఆరా తీశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రవిరెడ్డి, వైఎస్సార్ సీపీ నాయకులు రంగయ్య, కుమరేష్, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## సచివాలయ కన్వీనర్లే విజయ సారథులు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెంకటేగౌడ

- జగనన్నను మరోసారి సీఎం చేయడమే లక్ష్యం
- పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ

**పలమనేరు:** గృహసారథులు, సచివాలయాల కన్వీనర్లు వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ గెలుపు సారథులని పలమనేరు ఎమ్మెల్యే వెంకటేగౌడ సూచించారు. మండల గృహసారథులు, సచివాలయాల కన్వీనర్ల సమావేశం మండలంలోని టి.వడ్డూరు గ్రామ సమీపంలోని ఆంజనేయ స్వామి ఆలయ ప్రాంగణంలో గురువారం నిర్వహించారు. దీనికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ గత మూడున్నరేళ్లలో ప్రభుత్వం ప్రజలకు చేసిన సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికెళ్లి గుర్తు చేయాల్సిన బాధ్యత గృహ సారథులపై ఉందని స్పష్టం చేశారు. ఇప్పటికే గడపగడపకు మన ప్రభుత్వం ద్వారా తాను మూడు సార్లు నియోజకవర్గంలోని ప్రతి ఇంటికీ వెళ్లినట్లు చెప్పారు. ఎవరైనా అర్హులు ఇంకా మిగిలి ఉంటే ప్రభుత్వ పథకాలందేలా చూడాలన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నను ముఖ్యమంత్రిగా చేయడమే లక్ష్యంగా పనిచేయాలని సూచించారు. పార్టీకోసం కష్టపడేవారికి భవిష్యత్తులో తప్పకుండా గుర్తింపు ఉంటుందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఏఎంసీ చైర్మన్ హేమంత్‌కుమార్ రెడ్డి, ఎంపీపీ రోజా, జెడ్పీటీసీ సభ్యురాలు మల్లిక రంగనాథం, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ బాలాజీ నాయుడు, మండల సర్పంచుల సంఘం అధ్యక్షులు విశ్వనాథరెడ్డి, రాష్ట్ర కార్యదర్శులు మురళీకృష్ణ, రంగన్న, మాజీ కన్వీనర్ మండీసుధా, దీపిక కృష్ణమూర్తి, వైస్ ఎంపీపీలు జయశ్రీబాలాజీ నాయుడు, గజేంద్రబాబు, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, పీఏసీఎస్ అధ్యక్షులు రాజారెడ్డి, వైఎస్సార్‌సీపీ అనుబంధ విభాగాలు, పార్టీ శ్రేణులు, అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## లాభపడుతూనే సీఎంపై విమర్శలు



సమావేశంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ భరత్

**శాంతిపురం:** రాజకీయ వివక్షకు తావులేకుండా రాష్ట్రంలో సాగుతున్న పాలనతో ఒక వైపు లబ్ధి పొందుతున్న టీడీపీ నాయకులు మరోవైపు విమర్శలు చేస్తున్నారని ఎమ్మెల్సీ భరత్ చెప్పారు. కర్లగట్ట పంచాయతీ వెంకటాపురంలో గురువారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రామకుప్పం మండలం చెల్దిగానిపల్లిలో టీడీపీ నాయకుడి కుటుంబానికి ప్రభుత్వం నుంచి రూ.6 లక్షల మేర లబ్ధి చేకూరిందని చెప్పారు. చెంగుబళ్ల పంచాయతీలో మరో టీడీపీ నాయకుడి కుటుంబ సభ్యురాలి వైద్య ఖర్చుల కోసం రూ.5 లక్షల చెక్కును తానే అందజేశానని చెప్పారు. ఇంతగా లబ్ధి పొందుతున్నప్పటికీ వారిలో కొందరు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వాన్ని విమర్శించడం దారుణమన్నారు. సీఎం వైఎస్ జగన్ మాట ఇస్తే తప్పరని, చంద్రబాబు మాట ఇస్తే, వెంటనే మరచిపోతారని పేర్కొన్నారు.

**ఓటర్లుగానే చూశారు**

కుప్పం నియోజకవర్గ ప్రజలను చంద్రబాబు కేవలం తనకు ఓటేసే ఓటర్లుగా మాత్రమే చూశారని ఎమ్మెల్సీ భరత్ అన్నారు. సమస్యలు పట్టించుకోని వారిని నమ్మి మోసపోవద్దని కోరారు. 35 ఏళ్లుగా ఒకే వ్యక్తికి పట్టం గడుతుంటే ఆయన అధికారాన్ని పీఏల చేతిలో పెట్టారని చెప్పారు. వెంకటాపురానికి చెందిన వెంకటమ్మ కుటుంబం పేరిట వారికి తెలియకనే టీడీపీ నాయకులు ఇంటి బిల్లు కాజేశారని గుర్తుచేశారు. ఇలాగే వందలాది ఇళ్ల బిల్లులు మింగేశారని ఆరోపించారు. పనులు చేయిస్తామంటూ జన్మభూమి కమిటీల నాయకులు జనాన్ని జలగల్లా పీడించారని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు కోదండరెడ్డి, శ్రీనివాసులు, పెద్దన్న, బుల్లెట్ దండపాణి, చంగప్ప, కృష్ణమూర్తి, సుకుమార్, మునిరత్నంగౌడు, రఘురామిరెడ్డి, జగదీష్, మురుగేష్, చంగమరాజు తదితరులు పాల్గొన్నారు.

### గ్రంథాలయం తనిఖీ



బహుమతులు పంపిణీ చేస్తున్న అయూబ్ హుసేన్, అమ్ము, కిజర్‌ఖాన్

**పుంగనూరు:** పట్టణంలోని ఉర్దూ గ్రంథాలయాన్ని ఉర్దూ అకాడమి రాష్ట్ర డైరెక్టర్ డాక్టర్ ఎస్.అయూబ్ హుసేన్ గురువారం తనిఖీ చేశారు. జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ అమ్ము, గ్రంథాలయ చైర్మన్ కిజర్‌ఖాన్, అధికారి నసీబ్‌జాన్‌తో కలసి రికార్డులను పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రతి ఆదివారం గ్రంథాలయంలో ఉర్దూపై శిక్షణా కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. శిక్షణ కార్యక్రమంలో ఉత్తమ ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఖాజాసుల్తాన్, సభ్యులు వెంకటపతి, ఫయాజ్‌అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

### ఉర్దూ హైస్కూల్లో..



బడిలో మధ్యాహ్నభోజనాన్ని పరిశీలిస్తున్న డీవైఈవో

**పలమనేరు:** పట్టణంలోని ప్రభుత్వ ఉర్దూ ఉన్నత పాఠశాలను చిత్తూరు డీవైఈవో చంద్రశేఖర్ గురువారం తనిఖీ చేశారు. బడిలో అమలవుతున్న జగనన్న గోరుముద్ద పథకంలో భాగంగా వండిన ఆహార పదార్థాలను పరిశీలించారు. వాటి రుచి చూసి సంతృప్తిని వ్యక్తం చేశారు. అయితే పాఠశాలకు సంబంధిచిన రికార్డులను సక్రమంగా నిర్వహించాలని సూచించారు. సమ్మేటివ్–1 జవాబు పత్రాలను పరిశీలించారు. పాఠశాల ఉపాధ్యాయులకు పలు సలహాలు, సూచనలను చేశారు.

### మధ్యాహ్న భోజనం తనిఖీ



మధ్యాహ్న భోజన పథకాన్ని వడ్డిస్తున్న వైస్ ఎంపీపీ సుధాకర్ రెడ్డి

**చౌడేపల్లె :** మండలంలోని పందిళ్లపల్లె పంచాయతీ చుక్కావారిపల్లె ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని వైస్ ఎంపీపీ సుధాకర్‌రెడ్డి గురువారం తనిఖీ చేశారు. మెనూ ప్రకారం భోజనం అందిస్తున్నారా లేదా అని ఆరా తీశారు. భోజనం తిని రుచి చూశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు నాణ్యమైన విద్యతోపాటు, అన్ని రంగాల్లో విద్యార్థులను ప్రోత్సహించి ప్రభుత్వ పాఠశాలలను ఆదర్శంగా తీర్చిదిద్దాలని ఉపాధ్యాయులను కోరారు. పాఠశాలలో అవసరమైన వసతుల కల్పనకు కృషి చేస్తామన్నారు.

### ఆర్థికసాయం



ఆర్థిక సాయం అందిస్తున్న ఉపాధ్యాయులు

**సదుం:** మండలంలోని భట్టువారిపల్లె ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నాలుగో తరగతి విద్యార్థి గోకుల్ గత నెల రోడ్డు దాటుతూ వాహనం ఢీకొని మృతి చెందాడు. మృతుని అమ్మమ్మ సులోచనకు విద్యార్థులు, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలనుంచి వసూలు చేసిన ఆర్థిక సాయం రూ.7,500 గురువారం అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ శ్రీరాములు, వైస్ సర్పంచ్ బాబురెడ్డి, ఎస్ఎంసీ చైర్మన్ వినోద్, కో–కన్వీనర్ రాజశేఖర్, దాము, ఉపాధ్యాయులు సలీమున్నీసా, శ్వేత తదితరులు పాల్గొన్నారు.

## మహా శివరాత్రి వేడుకలకు ఆలయాలు సన్నద్ధం





రొంపిచెర్ల: మహా శివరాత్రికి ముస్తాబవుతున్న శివాలయం, సదుం: ధారా పాత్రను అందజేస్తున్న సభ్యులు

**రొంపిచెర్ల:** మహా శివరాత్రి వేడుకలకు మండల కేంద్రంలోని కట్టకింద శివాలయం ముస్తాబవుతోంది. ఆలయ కమిటీ చైర్మన్ కోటా వెంకటరమణ ఆధ్వర్యంలో ఆలయానికి రంగులు వేయిస్తున్నారు. మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సహకారంతో ఆలయం వద్దకు సీసీ రోడ్డు వేశారు. దాతల సాయంతో అయ్యప్పస్వామి గుడి, వినాయక స్వామి గుడి, సుబ్రమణ్యస్వామి ఆలయాలను నిర్మించడంతో ఆలయం దినదినాభివృద్ధి చెందుతోంది. భక్తుల సంఖ్య క్రమంగా పెరుగుతోంది. శని, ఆదివారాలలో ప్రత్యేక పూజలు ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. భక్తులకు ఇబ్బందుల్లేకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు వివరించారు.

**పెద్దపంజాణిలో..**

**పెద్దపంజాణి:** మండలంలోని కోగిలేరు జలకంఠేశ్వర స్వామి ఆలయంలో రెండు రోజుల పాటు శివరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ధర్మకర్తలు తెలిపారు. శనివారం రుద్రపారాయణం, లక్షబిల్వార్చన, స్వామివారికి కల్యాణోత్సవం, ఆదివారం శివకోటి మంగళహారతి, త్రిశూలస్నానం కార్యక్రమాలు ఉంటాయని చెప్పారు. రెండు రోజులు అన్నదానం చేయనున్నట్లు వివరించారు.

**ధారా పాత్ర వితరణ**

**సదుం:** స్థానిక వళ్లీ దేవసేన సమేత సుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణలోని అభీష్ట మృత్యుంజయేశ్వర మరకత లింగేశ్వరస్వామికి శైవ భక్తులు ధారా పాత్రను కానుకగా అందించినట్లు ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు తెలిపారు. దీని విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని చెప్పారు. దాతలకు పూజారి ప్రత్యేక దర్శనభాగ్యం కల్పించారు.

## భోజనానికి ముందు చేతుల శుభ్రత తప్పనిసరి



పిల్లలతో చేతులు శుభ్రం చేయిస్తున్న ఆరోగ్యాధికారి

**పలమనేరు:** కోవిడ్ మహమ్మారి భయంతో మాత్రమే కాదు, ఎప్పుడైనా భోజనానికి ముందు తప్పకుండా చేతులను శుభ్రం చేసుకోవడం అలవాటుగా చేసుకోవాలని మండల ఆరోగ్య విస్తరణ అధికారి జయశంకర్ సూచించారు. మండలంలోని పెంగరగుంట ప్రాథమిక పాఠశాలను గురువారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ భోజనానికి ముందు చేతులను ఆరు పద్ధతుల ద్వారా శుభ్రం చేసుకోవాలని సూచించారు. వేడిగా ఉండే ఆహారాన్ని స్వీకరించాలని చెప్పారు. ముఖ్యంగా దోమలు రాకుండా ఇంటివద్ద పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేగా గెలవలేని అసమర్థుడు లోకేష్



విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ నాయకులు

**విజయపురం :** నారా లోకేష్ ఎమ్మెల్యేగా కూడా గెలవలేని ఓ అసమర్థుడని, అలాంటి వ్యక్తికి మంత్రి గురించి మాట్లాడే అర్హత లేదని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ గోపినాథ్ అన్నారు. ఆయన గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. గత 40 ఏళ్లలో ఎంతో మంది ఎమ్మెల్యే అయినా, మంత్రి ఆర్కే రోజా చేసిన అభివృద్ధి ఎవ్వరూ చేయలేదని చెప్పారు. అంతే కాకుండా తాను సొంతంగా చారిటబుల్ ట్రస్టు ఏర్పాటు చేసి ఎంతో మందిని ఆదుకుంటున్నారని గుర్తు చేశారు. నిత్యం ప్రజల మధ్య ఉంటూ ప్రజాసేవ చేయడానికే నగరిలో ఇల్లు నిర్మించుకున్నారని, అది ఓర్వలేక మహిళలను రెచ్చగొట్టి ఇంటిపైకి పంపడం దురదృష్టకరమని అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివరాజు, గుణశేఖర్‌రెడ్డి, శేఖర్‌రాజు, కుమార్‌రెడ్డి, ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## పరికిదొనలో కనుల పండువగా ఆవులపబ్బం

**చౌడేపల్లి:** మండలంలోని పన్నెండు గ్రామాల ప్రజలు కలిసి పరికిదొన గ్రామంలో ఏటా నిర్వహించే ఆవుల పబ్బం గురువారం కనుల పండువగా ప్రారంభమైంది. మహాశివరాత్రి పండుగ ముందు వారం ఆవులపబ్బం నిర్వహించడం ఆనవాయితీ. ఈ పండుగను గ్రామస్తులు రెండు రోజుల పాటు ఘనంగా నిర్వహిస్తారు. ప్రజలందరూ పోటాపోటీగా పశువులను ముస్తాబు చేసి నాగప్ప చెరువులోని 12 గ్రామాలకు చెందిన పశువులను ఒకే చోటుకు గుంపుగా తోలి పశు సంపద పెరగాలని ప్రత్యేక పూజలు చేశారు. చాందినీ బండ్లను ప్రత్యేకంగా అలంకరించి గ్రామంలో నుంచి కాటమరాజుల ఆలయం వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. చాందినీ బండిలో ఏర్పాటుచేసిన కాటమరాజులకు గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించారు. సాయంత్రం చిట్లాకుప్పకు నిప్పంటించి పశువులపై ముద్దకూడును చెల్లారు. పన్నెండు గ్రామాల్లోని ఇళ్లు బంధుమిత్రులతో సందడిగా మారాయి.



చాందినీ బండిని మేళతాళాల నడుమ ఊరేగింపుగా తీసుకొస్తున్న ప్రజలు



విభిన్నరకాల్లో ఆకట్టుకుంటున్న చాందినీబండ్లు

### దౌర్జన్యంపై ఫిర్యాదు



ధ్వంసమైన ఫెన్సింగ్, నరికేసిన చెట్లు

**శాంతిపురం:** మండలంలోని సొన్నేగానిపల్లి పంచాయతీ గుండిశెట్టిపల్లిలో తమ కుటుంబంపై ముగ్గురు వ్యక్తులు దౌర్జన్యం చేశారని బాధితుడు రాళ్లబూదుగూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. గుండిశెట్టిపల్లికి చెందిన వెంకట్రామప్ప ఫిర్యాదు మేరకు, గ్రామంలో తమ ఇంటి పక్కన అనువంశికంగా సంక్రమించిన ఉన్న ఖాళీ స్థలం చుట్టూ ఫెన్సింగ్ వేసి అరటి, బొప్పాయి చెట్లు పెంచుతున్నారని చెప్పారు. రామకుప్పం మండలం కొల్లుపల్లికి చెందిన ముగ్గురు బుధవారం తాను ఇంట్లో లేని సమయంలో వచ్చిన భార్య గౌరమ్మపై దాడి చేసి ఖాళీ స్థలం చుట్టూ ఉన్న ఫెన్సింగ్ ధ్వంసం చేసి, చెట్లను నరికివేశారని పేర్కొన్నారు. దీనిపై విచారణ జరిపి న్యాయం చేయాలని ఫిర్యాదులో పోలీసులను కోరాడు.